సెలవులను రాజకీయానికి ఉపయోగించుకోవడం దారుణం : యుటిఎఫ్

ప్రజాశక్తి - కలెక్టరేట్

సంక్రాంతి సెలవులను రెండురోజులు పొడిగించి, ఆ రెండు రోజులను సాధారణ సెలవుల్లో (ఆదివారం, రెండో శనివారం) పాఠశాలలు పని చేయాలని ఉత్తర్వులు ఇవ్వడేమిటని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీ మోహనరావు ప్రశ్నించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కోరిక మేరకు సంక్రాంతి సెలవులు పొడిగించామనడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఉపాధ్యాయులకు, పాఠశాలలకు ఆప్షనల్ హాలిడే, లోకల్ హాలిడేస్ ఇవ్వడం కోసం పని దినాలు సరిపడవన్నారు. కావున ఒహెచ్, ఎల్ హెచ్ ఇవ్వరాదని చెప్పిన అధికారులకు ఇప్పుడు ఆ నిబంధనలేవీ వర్తించవా అని ప్రశ్నించారు. ఈనెల 23 నుంచి ఎఫ్ ఎ-3 పరీక్షలు ఉన్నాయి. అలాగే టెన్త్ పరీక్షలు దగ్గర పడతున్నాయని, ఈ సెలవుల పొడిగింపు వల్ల విద్యార్థుల చదువుకు తీవ్ర ఆటంకం కలుగుతుందని అన్నారు. తమ రాజకీయాల కోసం విదార్థుల చదువులు బలి చేయడం అన్యాయమని అన్నారు.

నేటి నుంచి కులగణన

ఇంటింటికీ సచివాలయ సిబ్బంది ● వివరాల వెల్లడి స్వచ్ఛందమే ● సమాచార గోప్యత ప్రభుత్వానిదే



ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో కులగణన ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ప్రతి సచివాలయ పరిధిలో ఇంటింటికీ వెళ్లి కులగణన చేస్తారు. దీని కోసం రూపొందించిన ప్రత్యేక యాప్ ఇప్పటికే అందుబాటులోకి వచ్చిందని అధికారులు చెబుతున్నారు. ఈ నెల 28 వరకు పది రోజులపాటు మొబైల్ యాప్ ద్వారా డోర్ టూ డోర్ సర్వే నిర్వహిస్తారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖ, ప్లానింగ్, సంక్షేమ శాఖల నుంచి ఎంపిక చేసిన సూపర్‌వైజర్లు, మండల ప్రత్యేక అధికారులు, డివిజన్, జిల్లా అధికారులు ఈ సర్వేను పర్యవేక్షిస్తారు. జిల్లా స్థాయిలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, మైనారిటీ సంక్షేమ అధికారులు పర్యవేక్షిస్తారు. కులగణన, నమోదు ప్రక్రియ, విధి విధానాలు తదితర అంశాలపై గ్రామ, మండల స్థాయితోపాటు జిల్లా స్థాయిలో, జోనల్ స్థాయిలో శిక్షణా కార్యక్రమాలు కొద్దిరోజుల క్రితం ముగిశాయి. ఇప్పటికే రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లోని ఏడు సచివాలయాల పరిధిలో కులగణన పైలట్ ప్రాజెక్టులను నిర్వహించింది. ఆయా అనుభవాలతో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టేందుకు యంత్రాంగం సమాయత్తమైంది.

కులగణన ప్రక్రియలో వ్యక్తులు తమ వివరాలను స్వచ్ఛందంగానే వెల్లడించాల్సి ఉంటుంది. కులం వివరాలను చెప్పడానికి ఇష్టం లేనివారి కోసం నో కేస్ట్ కేటగిరీ కూడా అందుబాటులో ఉంటుంది. వివరాల కోసం ఎవరినీ బలవంత పెట్టే పరిస్థితి ఉండదని అధికారులు చెబుతున్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు గానీ, ఇతర ఆధారాలు గానీ సమర్పించాల్సిన అవసరం లేదు. కులాంతర వివాహాలు చేసుకున్న జంటల్లో ఎవరి కులం వారికే నమోదు చేస్తారు. వివరాలను ధవీకరిస్తూ కుటుంబంలో ఎవరో ఒకరు బయోమెట్రిక్ వేసి నిర్ధారించాల్సి ఉంటుంది. సేకరించిన వివరాలను పూర్తి గోప్యంగా, భద్రంగా ఉంచుతామని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. కులగణన ద్వారా ఆయా తరగతుల అభివృద్ధికి అనుగుణంగా సంక్షేమ పథకాలను అమలు చేయడానికి వీలు కలుగుతుందని ప్రభుత్వం చెప్తోంది. ముఖ్యంగా వివిధ కులాల సామాజిక, ఆర్థిక పరిస్థితులు, వారి విద్య, జన సంఖ్య తెలుసుకొని, వారికి ప్రయోజనాన్ని చేకూర్చడానికి ఈ సర్వే ఎంతగానో దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

సర్వేలో సేకరించే వివరాలు

- కుటుంబం అందుబాటులో ఉన్నారా / మరణించారా / శాశ్వతంగా వలస వెళ్లారా?.
- జిల్లా, జిల్లా కోడ్, మండలం/మున్సిపాలిటీ, గ్రామం, పంచాయతీ, పంచాయతీ కోడ్ , వార్డు నంబర్, ఇంటి నంబర్.
- కుటుంబ పెద్ద పేరు, ఆధార్, రేషన్ నంబర్లు, కుటుంబ సభ్యుల సంఖ్య, పేర్లు, కుటుంబ పెద్దతో సంబంధం.
- కుటుంబం నివాసం ఉంటున్న ఇల్లు.
- ప్రస్తుతం ఉన్న చిరునామా.
- మరుగుదొడ్డి సౌకర్యం ఉందా లేదా.?
- మంచి నీరు/ తాగునీరు సదుపాయం ఉందా.? (వీధి కుళాయి, బోర్‌వెల్, పబ్లిక్ బోర్ వెల్, సొంత కుళాయి)
- పశు సంపద ఏమైనా కలిగి ఉన్నారా?.
- వంట చేసే విధానం (ఎల్‌పిజి గ్యాస్, కిరోసిన్, కట్టెలు).

కుటుంబ సభ్యుల వివరాలు

- కుటుంబ సభ్యుని పేరు, తండ్రి పేరు, జెండర్, పుట్టిన తేది, వైవాహిక స్థితి, కులం, ఉప కులం, మతం, విద్యార్హత, ప్రస్తుతం చేస్తున్న వృత్తి.
- వ్యవసాయ భూమి వివరాలు.
- నివాస స్థలం వివరాలు.

కులగణన షెడ్యూల్

- జనవరి 19 నుంచి 28 : ఇంటింటి సర్వే
- జనవరి 29 నుంచి ఫిబ్రవరి 2 : మిగిలిపోయిన ఇళ్లు, వ్యక్తుల వివరాల సేకరణ
- ఫిబ్రవరి 15 వరకు : సచివాలయ స్థాయిలో డేటా క్రోడీకరణ, ఖరారు.



తమకు మరోసారి సీటు గ్యారెంటీ అన్న ధీమా ఉమ్మడి విజయనగరం జిల్లాలో సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో వ్యక్తమౌతోంది. బయట కూడా అదే రకమైన చర్చ నడుస్తోంది. విజయనగరం ఎమ్‌పి సీటు తిరిగి బెల్లానకు కేటాయించే విషయంలో మాత్రం ఇంకా డైలమా కొనసాగుతోంది. జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)కు దాదాపు ఖరారైందని ఆయన అనుయాయులు చెప్తుండగా, ఎమ్‌పిగా పోటీ చేసేందుకు ఆయన అంత ఆసక్తికరంగా లేరని కొందరు చెప్తున్నారు. మరోవైపు సిట్టింగ్ ఎమ్‌పి బెల్లాన కూడా ఈసారి కూడా ఎమ్‌పి టికెట్ తనకేనని ఒకింత ధీమా వ్యక్తం చేస్తున్నారు.

● బెల్లానను తప్పిస్తే జెడ్‌పి పీఠం కట్టబెడతారని చర్చ

ఎమ్మెల్యేల్లో ధీమా.. ఎమ్‌పిపై డైలమా..!

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా సిట్టింగుల్లో గుబులు మొదలై పక్షం రోజులు గడుస్తున్నప్పటికీ విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో మాత్రం అటువంటి పరిణామాలు చోటుచేసుకునే పరిస్థితి లేదని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు. రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులును ఈసారి అక్కడి నుంచి తప్పించినప్పటికీ అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నుంచి అవకాశం కల్పించారు. అటు ప్రభుత్వంలోనూ, ఇటు వైసిపిలోనూ కీలకంగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ రెండు జిల్లాలకు చెందిన ఎమ్‌పి, ఎమ్మెల్యేలను మార్చాల్సిన అవసరం లేదని అధిష్టానానికి చెప్పినట్టు, గెలిపించే బాధ్యత తాను చూసుకుంటానని భరోసా ఇచ్చినట్టు చర్చనడుస్తోంది. మరోవైపు జిల్లా పార్టీని సమన్వయం చేస్తున్న చిన్న శ్రీను కూడా ఈసారి చట్టసభల్లోకి వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈనేపథ్యంలో సిట్టింగ్ ఎమ్మెల్యేలు యథాతథంగా కొనసాగితే ఈ రెండు జిల్లాల్లో ఎమ్మెల్యేగా పోటీచేసే అవకాశం ఆయనకు దక్కే పరిస్థితి లేదు. రాజాం ఖాళీ అయినప్పటికీ అక్కడ రిజర్వేషన్ అనుకూలించదు. ఈ నేపథ్యంలోనే చిన్న శ్రీనును అధిష్టానం ఎమ్‌పిగా పంపేందుకు ఆలోచన చేస్తోందని చర్చనడుస్తోంది. ఆయనకు ఎమ్‌పిగా అవకాశం కల్పిస్తే సిట్టింగ్ ఎమ్‌పి బెల్లాన భవితవ్యం ఏమిటనేది ప్రశ్నగా మారింది. జిల్లాను ముందుకు నడపడంలో చిన్న శ్రీను ఎంతో, చీపురుపల్లి నియోజకవర్గంలో మంత్రి బొత్స గెలుపులో బెల్లాన కూడా అంతేనని పలువురు విశ్లేషిస్తున్నారు. ఈనేపథ్యంలో బెల్లానకు స్పష్టమైన హామీ ఉంటే తప్ప ఎన్నికల్లో మనసుపెట్టి పనిచేసే అవకాశం లేదని, అదే జరిగితే బొత్సకు కొంత ఇబ్బంది ఏర్పడుతుందని ఊహాగానాలు వ్యక్తమౌతున్నాయి.

ఈ నేపథ్యంలో చిన్న శ్రీనుకు ఎమ్‌పి సీటు ఇస్తే, ప్రస్తుతం ఆయన కూర్చున్న జెడ్‌పి చైర్మన్ పీఠం కట్టబెడతామని బెల్లానకు నచ్చజెప్పే పరిస్థితి వస్తుందని, ఆ దిశగా ఆలోచన, చర్చలు కూడా నడుస్తున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అందువల్లే ఉత్తరాంధ్రలో ఎమ్‌పి అభ్యర్థుల జాబితా మొత్తం ప్రకటించినప్పకీ విజయనగరం అభ్యర్థిని బయట పెట్టలేదని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఎమ్‌పి సీటు ఇచ్చినంత మాత్రాన ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఆయువుపట్టులాంటి జెడ్‌పి సీటును చిన్న శ్రీను వదులుకునే పరిస్థితి ఉండదని కూడా చర్చనడుస్తోంది. ఈ నేపథ్యంలో విజయనగరం ఎమ్‌పి సీటు ఎవరికనేది మంత్రి బొత్స వ్యూహం, చిన్న శ్రీను ఆలోచన, ఆసక్తిపై ఆధారపడి ఉంటుంది.

వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు

గ్రామస్తులకు సూచనలు ఇస్తున్న జోనల్ మలేరియా అధికారి శాంతిప్రభ

ప్రజాశక్తి - కురుపాం

గ్రామాల్లో ప్రజలు వ్యాధుల బారినపడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ ఎం.శాంతిప్రభ వైద్య సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని గుమ్మడిగూడ గ్రామాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ప్రజలతో దోమతెరలు వాడకాలపై ఆరా తీశారు. గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్‌లో నిర్వహించిన వైద్య పరీక్షలను పరిశీలించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను పరిశీలించి జ్వర నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉంచాలని, మలేరియా, డెంగీ జ్వరాలు వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు చేపట్టి, డ్రైడే కార్యక్రమాలను పక్కగా నిర్వహించాలని వైద్యాధికారిని, సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఒపి నిర్వహణ, ల్యాబ్ పరీక్షల రికార్డులు తనిఖీ చేసి జ్వరాల నమోదు పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడుతూ జ్వరాలను గుర్తించిన వెంటనే చికిత్స అందించాలని సంబంధిత క్షేత్ర స్థాయి సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ బి.శోభారాణి, ఎఎంఒ సూర్యనారాయణ, వైద్యాధికారి తనూజ, సబ్ యూనిట్ అధికారి నారాయణరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని రేగిడి, దుడ్డుఖల్లు పిహెచ్‌సిలను జోనల్ మలేరియా అధికారి డాక్టర్ ఎం.శాంతిప్రభ ఆకస్మిక పర్యటించారు. గ్రామాల్లో దోమల వ్యాప్తి ప్రదేశాలను గుర్తించి సచివాలయ సెక్రటరీ ద్వారా ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అక్కడ ప్రజలతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం పిహెచ్‌సిల్లో ఒపి నిర్వహణ, ల్యాబ్ పరీక్షల రికార్డులు తనిఖీ చేసి జ్వరాలు ఏ మేరకు నమోదు అవుతున్నాయని పరిశీలించారు. జ్వరాలు గుర్తించిన సత్వరమే చికిత్స అందించాలని ఆదేశించారు. గ్రామ స్థాయిలో జ్వర నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉంచాలని మలేరియా, డెంగీ తదితర జ్వరాలు వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు చేపట్టాలని, డ్రైడే కార్యక్రమాలు పక్కగా నిర్వహించాలని ఆదేశించారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉండాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

పాలకొండ నియోజకవర్గ పరిధిలో గల అన్ని పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతులు ఉండాలని ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి అన్నారు. మండలంలోని ఆడలి, వజ్జాయిగూడ, కోడిశ గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాలు లేకపోవడంపై స్పందించిన ఆమె సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఐటిడిఎ పరిధిలో గల అన్ని గిరిజన గ్రామాల్లో సికిల్ సెల్ పరీక్షలు చేయాలని పిఒ అన్నారు. మండలంలోని జిల్లేడుపాడులో చేస్తున్న సికిల్‌సెల్ ఎనిమీయా పరీక్షలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ దీనిపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామస్థులతో మాట్లాడుతూ సికిల్‌సెల్ పరీక్షలను అందరూ చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలకు వివరించాలని అన్నారు. టెస్టులను వేగవంతం చేయాలని అన్నారు.

టూరిజం పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

ఐటిడిఎ పరిధిలో చేపడుతున్న పర్యాటక పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పిఒ కల్పనాకుమారి అన్నారు. ఆడలి వ్యూ పాయింట్ పనులను పిఒ పరిశీలించారు. పనులు నెమ్మదిగా సాగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత ఎఇపై చర్యలు తీసుకోవాలని, పనులను వేగవంతం చేయాలని డిఇని ఆదేశించారు. కార్యక్రమంలో డిఇ కృష్ణమోహన్, ఎఇ నాగభూషణ్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి

పాలకొండ నియోజకవర్గ పరిధిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సెక్టార్ అధికారులు, సంబంధిత పోలీస్ అధికారులు కలిసి గుర్తించాలని పిఒ సూచించారు. ఈ మేరకు నియోజకవర్గంలోని సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ మీ సెక్టార్ పరిధిలో ఏదైనా పోలింగ్ స్టేషన్ మార్చాల్సి ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు అవసరమయ్యే అన్ని సౌకర్యాలు ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత సెక్టార్ అధికారులదేనన్నారు. ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకూడదన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల తహశీల్దార్లు, సెక్టార్ అధికారులు, పోలీస్ అధికారులు, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, పక్కన ఎస్‌పి విక్రాంత్ పాటిల్, జెసి గోవిందరావుం

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

గణతంత్ర దినోత్సవ వేడుకలకు సిద్ధం కావాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై గురువారం స్థానిక కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గణతంత్ర వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. మైదానంలో ఏర్పాట్లను ఆర్‌అండ్‌బి శాఖ, వేదిక పర్యవేక్షణ ఆర్‌డిఒ చూడాలని ఆదేశించారు. పూర్తి స్థాయిలో పోలీస్ పేరెడ్, బందోబస్తు ఉండాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డిఇఒను, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. మైదానంలో పారిశుద్ధ్యం నిర్వహణ, తాగునీటి ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షించాలని చెప్పారు. గణతంత్ర వేడుకలకు విద్యుత్తు సరఫరా ఇబ్బందులు కాకుండా ఈ పి డి సి ఎల్ అధికారులు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. మైదానం వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. గహ నిర్మాణ సంస్థ, గిరిజన సంక్షేమ శాఖ, జిల్లా విద్యాశాఖ, వ్యవసాయం - ఉద్యాన శాఖలు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, దిశా, ఇంజనీరింగ్ శాఖలు శకటాలను ఏర్పాటు చేయాలని, ఐసిడిఎస్, జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ తదితర శాఖలు ప్రదర్శన శాలలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రదర్శనశాల ఏర్పాటుకు డిఆర్‌డిఎ పీడీ, శకటాల ఏర్పాటుకు డ్వామా పీడీ సమన్వయకర్తలుగా ఉంటారని ఆయన చెప్పారు. సమావేశంలో ఎస్‌పి విక్రాంత్ పాటిల్, జెసి ఆర్.గోవిందరావు, డిఆర్ఒ జె.వెంకటరావు, ఎఎస్‌పి ఒ.దిలీప్‌కిరణ్, అధికారులు పాల్గొన్నారు.

సాలూరులో కళ్లు, చెవులు మూసుకొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

మెట్టుదిగకపోతే పట్టు వదిలేది లేదు

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె ● వినూత్న రూపాల్లో నిరసనలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం మెట్టుదిగకపోతే తాము పట్టు సడిలించేది లేదని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సమ్మె 38వ రోజు గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద కొనసాగింది. సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, ప్రాజెక్టు నాయకులు సాలూరు గౌరీమణి, మర్రాపు అలివేలు ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి మాట్లాడుతూ 38రోజులుగా అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని, జీతాలు పెంచాలని రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తుంటే, మరోవైపున ప్రభుత్వం నోటీసులు ఇచ్చి అంగన్‌వాడీలను బెదిరింపు చర్యలకు పాల్పడడం సరైన పద్ధతి కాదన్నారు. అంగన్వాడీలకు జీతాలు పెంచేంత వరకు సమ్మె కొనసాగిస్తామని ఆమె అన్నారు. కార్యక్రమంలో సెక్టార్ నాయకులు పార్వతమ్మ, కె.రాజేశ్వరి, ఎం.గౌరి, జయలక్ష్మి, రాజేశ్వరి, జ్యోతి, ధర్మవతి, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ అంగన్వాడీలు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం నాటికి అంగన్‌వాడీల నిరవధిక సమ్మె 38వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్వాడీల పోరాటాలకు వివిధ గ్రామాల సర్పంచులు సంఘీభావం తెలుపుతూ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జి వెంకటరమణ, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు సునీత, రెడ్డి లక్ష్మి, పి.పద్మ, సత్యవతి, పలు గ్రామాలకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ఐటిడిఎ ఎదుట 38వ రోజు నిరవధిక సమ్మె సందర్భంగా సంజాయిషీ నోటీసులు చేతిలో పట్టుకొని అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు ఎ.పార్వతి, ఎ.దర్శమి, సిఐటియు మండల కార్యదర్శి ఎం.కాంతారావు, పలువురు కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కళ్లు, చెవులు మూసుకుని అంగన్వాడీల నిరసన

సాలూరు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె 38రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్యకర్తలు, హెల్పర్లు కళ్లు, చెవులు మూసుకొని నిరసన తెలిపారు. అనంతరం యూనియన్ నాయకులు నారాయణమ్మ, శశికళ మాట్లాడుతూ 38రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తిరుపతమ్మ, సుభద్ర, సుజాత పాల్గొన్నారు.

పాలకొండ : తమ సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు చేస్తున్న సమ్మె గురువారానికి 38వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మె సందర్భంగా ప్రభుత్వం జారీ చేసిన షోకాజ్ నోటీసులు పట్టుకొని నిరసన ర్యాలీ నిర్వహించి అనంతరం పాలకొండ ఐసిడిఎస్ సిడిపిఒ బి.సిమ్మలమ్మకు ప్రభుత్వం జారీ చేసిన షోకాజ్ నోటీసుకు బదులుగా సమాధానం రూపంలో నోటీసులను ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు ప్రభుత్వ బెదిరింపులకు అదిరేది లేదు, బెదిరేది లేదన్నారు. అంగనవాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి హిమ ప్రభ, కోశాధికారి బి అమరవేణి మాట్లాడుతూ అంగన్వాడీల పోరాటం పట్ల పాలకుల మొండి వైఖరికి తగిన గుణపాఠం భవిష్యత్తులో చెబుతుందన్నారు. చర్చల పేరుతో సమస్యలు పరిష్కరించకపోగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ ప్రభుత్వం నిర్బంధానికి పాల్పడడం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, అంగన్వాడీలపై దుష్ప్రచారాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు జి.జెస్సీబాయి, జి.శారద, ఎ.విజయలక్ష్మి, బి.అచ్చమ్మ, ఎస్.గంగమ్మ, ఎల్.జ్యోతి, ఎన్.రాజేశ్వరి, బి.లలిత ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో పాలకొండ, వీరఘట్టం మండలాల్లోని అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

కురుపాం : అంగన్వాడీల న్యాయమైన హక్కులపై సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం అనవసరమైన ఎస్మా జీవోలు వారిపై ప్రయోగించడం సమంజసం కాదని సిఐటి నాయకులు వి.ఇందిర అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఎస్మా జీవోలు ఉపయోగించి భయపెట్టాలని ప్రభుత్వం చూస్తుందని, హక్కులు సాధించే వరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.సరళకుమారి, ప్రాజెక్టు కార్యదర్శి జె.సరోజ, సెక్టార్ లీడర్లు ఎం.మీనాక్షి, డివి రత్నం, బి.జయలక్ష్మి, ఎస్.సులోచన, డి.జ్యోతిలక్ష్మి, ఎన్. సుమతి తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె నిర్మించే ప్రసక్తి లేదని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు చేపడుతున్న సమ్మె గురువారం కొనసాగింది. మండల టిడిపి కన్వీనర్ ఎస్.శేఖర పాత్రుడు ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు పి.వెంకటనాయుడు, దేవకోటి వెంకటనాయుడు, ఎం.కృష్ణమూర్తి, ఎన్.మధుసూదన్‌రావుతో పాటు మండల నాయకులు వచ్చి మద్దతు పలుకుతూ రూ.5వేలు అంగన్వాడి సిబ్బందికి విరాళాలు అందజేశారు. మండల కేంద్రం నుంచి ఐసిడిఎస్ ప్రాజెక్టు వరకు ర్యాలీగా వెళ్లి ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసుకు బదులుగా అంగన్వాడీ చెప్పంది కూడా నోటీసు ఐసిడిఎస్ సిడిపిఒ సుగుణకు అందజేశారు. అనంతరం మానవహారం వేస్తూ నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధ్యక్షులు సిహెచ్ గౌరమ్మ, ఉపాధ్యక్షులు సిహెచ్ అనురాధ, సెక్టార్ నాయకులు బి.అలివేలు, జ్యోతి, మల్లేశ్వరమ్మ, పద్మ, జయమ్మ, భవాని, గరుగుబిల్లి సెక్టర్ లీడర్లు సావిత్రమ్మ హైమావతి మీనాక్షి పాల్గొన్నారు.

సీతంపేటలో శిబిరం వద్ద షోకాజ్ నోటీసులు పట్టుకొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు; కొమరాడలో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద మానవహారం చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



కురుపాంలో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద షోకాజ్ నోటీసులు పట్టుకొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి
www.prajasakti.com

తెలుగు వారి గుండె చప్పుడు ఎన్‌టిఆర్

పలుచోట్ల ఘన నివాళులు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్/టౌన్

తెలుగు వాళ్ల గుండె చప్పుడు నందమూరి తారకరామారావు అని, ఎన్నేళ్లయినా ఎన్నాళ్ళైనా వారి గుండెల్లో నిలిచిపోతారని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. ఎన్టీఆర్ 28వ వర్ధంతి కార్యక్రమాలు పార్వతీపురం పట్టణంతో పాటు మండలంలో పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. కృష్ణపల్లిలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిరంజీవి, ఎఎంసి మాజీ చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావుతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నర్సిపురంలో జరిగిన కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గొట్టాపు గౌరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున అభిమానులు కార్యకర్తలు హాజరై నివాళులర్పించారు. పట్టణంలోని పాత బస్టాండ్ లో ఉన్న విగ్రహానికి ఏడో వార్డు కౌన్సిలర్ కోరాడ నారాయణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ నాయకులు బార్నాల సీతారాం, మజ్జి వెంకటేష్, ఎన్టీయార్ అభిమానులు పాకల సన్యాసిరావు, ఇజ్జరాపు శ్రీనివాసరావు, రౌతు చిన్నారావు, తోట నాగరాజు, వినయ్, కాకర్ల గంగరాజు, రెడ్డి వెంకటప్రసాద్ ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, మాజీ సర్పంచ్ బేత లక్ష్మణరావు ఆధ్వర్యంలో తాళ్లబురిడిలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో నాయకులు పోల సత్యనారాయణ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు రొట్టెలు అందించారు.

సాలూరు: టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్ వర్ధంతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.సంధ్యారాణి ఆధ్వర్యాన కార్యకర్తలు, నాయకులు ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని వెంకటేశ్వరా డీలక్స్ సెంటర్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే గొప్ప నేత ఎన్టీఆర్ అని అన్నారు. మండలంలోని శివరాంపురం గ్రామంలో కూడా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జీగిరాంలో స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఇంఛార్జి సంధ్యారాణి పరిశీలించారు. ఆమె వెంట పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పాచిపెంట : మండల కేంద్రంలో మండల టిడిపి అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వంద మంది పేదలకు రగ్గులు, దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే పార్వతీపురం ఏరియా హాస్పిటల్ వైద్యుల నేతృత్వంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 34 మంది యువకులు టిడిపి కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు మంచాల పారమ్మ, కొత్తల పోల్నాయుడు, జి.సత్యం, రౌతు తిరుపతిరావు, దండి మోహన్‌రావు, కె.సత్యనారాయణ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : తెలుగు ప్రజల ఆత్మగౌరవమే నందమూరి తారక రామారావు అని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు అన్నారు. ఎన్టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి టి.జగదీశ్వరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీయార్ సేవలు గుర్తించి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, అరకు పార్లమెంటు అధికారి ప్రతినిధి డొంక రామకృష్ణ, ఐదు మండలాల టిడిపి కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మక్కువ : నందమూరి తారక రామారావు వర్ధంతి మక్కువలో మండల టిడిపి అధ్యక్షులు గుళ్ల వేణుగోపాలనాయుడు ఆధ్వర్యంలో జరిగింది. తొలుత ఎన్టీయార్ చిత్రపటానికి మండల తెలుగుదేశం పార్టీ తరుపున నాయకులు అత్యంత ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మావుడి ప్రసాద్‌నాయుడు, సిహెచ్ తవిటినాయుడు, బొంగు వాసుదేవరావు, డాక్టర్ పి.మల్లేశ్వరరావు, గొంగాద భూషణ్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీ పురం : టిడిపి వ్యవస్థాకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతిని గుమ్మ లక్ష్మీపురంలో ఘనంగా నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

సీతంపేట : ఎన్టీయార్ వర్ధంతి సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పూలమాలవేసి నివాళ్లు అరిపంచారు. అనంతరం స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సవర తోట మొఖలింగం, నిమ్మక నాగేశ్వరావు, ఆర్.రంగనాథం, గంట సుధా, ఇమరక పవన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే టిడిపి నాయకులు బిడ్డిక దమయంతి నాయుడు ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో నాయకులు మాలయ్య, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం : ఎన్‌టిర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న చిరంజీవులు



సాలూరు, కురుపాంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సంధ్యారాణి, జగదీశ్వరి; సీతంపేటలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న జయకృష్ణ, పాచిపెంటలో పేదలకు దుప్పట్లు, రగ్గులు అందజేస్తున్న టిడిపి నాయకులు

చంద్రబాబుకు బొకేను అందజేస్తున్న తేజోవతి

చంద్రబాబును కలిసిన తేజోవతి

ప్రజాశక్తి - సాలూరు/మక్కువ

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును గురువారం గిరిజన మహిళా నాయకులు ఎం.తేజోవతి కలిశారు. అమరావతిలో పార్టీ కార్యాలయంలో బాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పారు. కొద్దిరోజుల క్రితం బొబ్బిలిలో నిర్వహించిన రా కదలిరా కార్యక్రమంలో తేజోవతికి చంద్రబాబునాయుడు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆమె స్థానిక ఎమ్మెల్యే టికెట్‌ను ఆశిస్తున్నారు. ఆమెతో పాటు పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు భంజ్ దేవ్, మక్కువ టిడిపి మండల నాయకులు పెంట తిరుపతినాయుడు కూడా చంద్రబాబు నాయుడును కలిశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి అందరితో కలిసి పనిచేయాలని చెప్పినట్టు తేజోవతి తెలిపారు.

రోడ్లకు త్వరగా అనుమతులు జారీచేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన, ఆర్పిపి ఎల్ డబ్ల్యు రహదారి పనులకు అనుమతులు త్వరగా జారీ చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ కోరారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురువారం జిల్లా కలెక్టర్లతో భూ రికార్డులు, జగనన్న ఆరోగ్య సురక్ష తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన, ఆర్పిపి ఎల్ డబ్ల్యు రహదారి పనులు చేపట్టేందుకు అనుమతులు కేంద్ర ప్రభుత్వ విభాగం నుండి పొందాల్సి వస్తుందని, తద్వారా జాప్యం జరుగుతోందని అన్నారు. జాప్యం నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష రిఫరల్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కంటి వెలుగు కింద కళ్లద్దాలు పంపిణీ వేగవంతం చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, డిఆర్ఒ జె.వెంకటరావు, కెఆర్ఆర్‌సి ఎస్‌డిసి జి.కేశవ నాయుడు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డిఎంహెచ్ఒ బి.జగన్నాథ రావు, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె.రాజ కుమార్, వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.వినోద్, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కులగణనపై అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న కుల గణన సర్వేపై పిఎస్‌డిఎలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎంఎస్ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి కుల గణన వివరాలను సేకరించాలని, వచ్చిన వివరాలను పూర్తిస్థాయిలో పొందుపర్చాలని అన్నారు. ఈ కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. శిక్షణలో ఇఒపిఆర్‌డి కె.కుమార్‌వర్మ, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సవరకోటపాడు ఉద్యాన కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

పర్యాటక పనులు వేగవంతం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

హార్టికల్చర్ పనులు వేగవంతంగా పూర్తిచేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని స్థానిక ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్ సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మండలంలోని సవరకోటపాడు ఉద్యానవన కేంద్రంలో నిర్మిస్తున్న పర్యాటక ప్రాంత పనులను గురువారం సాయంత్రం ఆయన పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరు, పెండింగ్ పనులపై అధికారులతో చర్చించారు. పర్యాటకులను ఆకర్షించేలా పనులు జరగాలని సూచించారు. కార్యక్రమంలో ఇఇ శాంతీశ్వరరావు, డిఇ సింహాచలం తదితరులు ఉన్నారు.

సీతానగరం : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ ప్రసాద్

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఇఒపిఆర్‌డి కె.కుమార్ వర్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిపిడిపై శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీకి వచ్చే ఆర్థిక సంఘం నిధులను ఏఏ రంగాలకు ఖర్చు చేయాలి, ఆదాయ వనరులు సిద్ధం ఉంటే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంఎల్ఎన్‌వి ప్రసాద్, ఎంపిపి ప్రతినిధి బి.రవణమ్మ శ్రీరాములు నాయుడు, జడ్పిటిసి ఎం.బాబ్జీ, ఎంఇఒ జి.సూరిదేవుడుతో పాటు వివిధ గ్రామాల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ఎంపిపి మజ్జి శోభారాణి ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న డిఎల్‌పిఒ నాగభూషణరావు పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు, ఎంపిటిసిలకు, సర్పంచులకు సమగ్రంగా అవగాహన కల్పించగా, ఇఒపిఆర్‌డి ఎన్.కృష్ణుడు, పరిపాలన అధికారి రమణమూర్తి పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ చారిత్రాత్మక ఘట్టం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ స్వరాజ్ మైదానంలో ప్రపంచంలోనే ఎత్తైన 125 అడుగుల అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించడం చారిత్రాత్మక ఘట్టమని ఎపి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం వ్యవస్థాపకులు, ఎంఇఒ సామల సింహాచలం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సామల మాట్లాడుతూ విజయవాడ నడిబొడ్డున స్వరాజ్ మైదానంలో ప్రపంచంలోనే అతి పెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పాలనే ప్రభుత్వ ఆలోచన అభినందనీయమన్నారు. అంబేద్కర్ స్మృతి వనం ప్రాంగణంలో అంబేద్కర్ జీవిత విశేషాలతో కూడిన ఫోటో గ్యాలరీ ఏర్పాటు భావితరాలకు స్ఫూర్తిని కలుగ చేస్తుందన్నారు. "అంబేద్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం" ఆవిష్కరణ ప్రతి ఒక్కరూ గర్వించదగ్గ విషయమని అభివర్ణించారు.

పొగమంచు కమ్ముకున్న పట్టణం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో గురువారం ఎన్నడూ లేని విధంగా పొగమంచు కమ్ముకుంది. తెల్లవారు జాము నుండి పట్టణం ప్రాంతంతో పాటు, శివారు ప్రాంతాల్లో పొగ మంచు కొమ్ముకోవడంతో పాదచారులు సెల్ లైట్ వెలుగులోను, వాహన చోధకులు వాహనాల లైట్ల వెలుగులో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లా కేంద్రంలో ఈ పొగ మంచు ఆవరించడం వల్ల స్థానిక ప్రజలతో పాటు జిల్లా కేంద్రానికి తెల్లవారుజామున వచ్చే కూరగాయలు, పువ్వుల వ్యాపారులు, రోజువారి కూలీలు, పారిశుధ్య కార్మికులు పొగ మంచు పడకుండా ఉండేందుకు తలపై తువ్వాలు కప్పుకొని వచ్చే పరిస్థితి వచ్చింది. ఈ పొగ మంచు అధికంగా పడడంతో శ్వాసకోస వ్యాధులు ఉండే చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఉదయం 9 గంటల దాటిన తర్వాతే రహదారి పైకి వచ్చే పరిస్థితి వచ్చింది.

పార్వతీపురం రూరల్: మండలంలోని పలు గ్రామాలను గురువారం ఉదయం పొగమంచు దట్టంగా అనుకొని ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించింది. వేకువజామున ఐదు గంటలకు మంచు కురవడం ప్రారంభమై ఎనిమిది గంటల వరకు కొనసాగింది. పార్వతీపురం– విశాఖ రాష్ట్ర రహదారిపై వాహనాలను పట్టపగలే లైట్లు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. మార్నింగ్ వాకింగ్ వరకు వెళ్లే వారు మరింతగా ఇబ్బందులను ఎదుర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రిపబ్లిక్ పరేడ్ కోసం రిహార్సల్స్ నిర్వహిస్తున్న వివిధ పోలీసు దళాలు మార్చింగుకు అంతరాయం కలిగించింది. తరచూ కురుస్తున్న మంచు వల్ల జీడి మామిడి పూతలపై తీవ్ర ప్రభావం చూపనుందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. పూతలను రక్షించుకోవడానికి ఉద్యాన శాఖ అధికారుల సలహాతో పాటు సచివాలయంలో ఉన్న సహాయకుల సహకారాన్ని తీసుకోవాలని కోరుతున్నారు.

పొగమంచుతో నిలిచిపోయిన పోలీస్ పెరేడ్

సాగు హక్కు కల్పించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని గరిల్లవలస రెవెన్యూ కోటికి పెంట పంచాయితీ గోగాడవలసకు చెందిన తాము దీర్ఘకాలంగా ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, తమకు సాగు హక్కు కల్పించాలని గ్రామానికి చెందిన వైస్‌సర్పంచ్ కొత్తకోట ఎరుకులు, గ్రామస్తులు నరసయ్య తదితరులు రెవెన్యూ అధికారులను కోరుతున్నారు. తమ తాతల కాలం నుంచి సాగు చేస్తున్న భూములకు నేటికీ హక్కులు కల్పించకపోవడం దురదష్టమన్నారు. ప్రభుత్వాలు ఎప్పటికైనా సాగులో ఉన్న గిరిజనులను గుర్తించి వారికి హక్కులు కల్పించాలని కోరారు. లేకుంటే ఈ భూములు అన్యాక్రాంతం చేసేందుకు కొంతమంది ప్రయత్నిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి సాగు చేస్తున్న గిరిజన భూములకు హక్కులు కల్పించకపోతే కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు యుద్ధ ప్రాతిపదికన సాగులో ఉన్న పేదల భూములను గుర్తించి వారికి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గిరిజనుల భూములకు హక్కులు కల్పించి రక్షణ కల్పించాలని, లేకుంటే భవిష్యత్‌లో జరిగిన పోరాటాలకు ప్రభుత్వం, అధికారులు బాధ్యత పడాలన్నారు. మండలంలో గిరిజన భూములను నేటికీ సర్వేలు చేసి పూర్తిస్థాయిలో హక్కులు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బాధితుల నష్టపరిహారంపై దృష్టిసారించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

వివిధ ఎస్‌సి, ఎస్‌టి కేసుల్లో బాధితులకు నష్టపరిహారం చెల్లింపునకు వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతి కేసును పరిశీలించి వివరాలు అడిగారు. కేసుల విచారణ పక్కాగా నిర్వహించి త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. మొత్తం 17 కేసుల్లో వివిధ దశల్లో రూ.23 లక్షలు నష్టపరిహారంగా మంజూరు చేసినట్టు తెలిపారు. సమావేశంలో ఎస్‌పి విక్రాంత్ పాటిల్, జెసి ఆర్.గోవిందరావు, డిఆర్ఒ జె.వెంకట రావు, ఎఎస్‌పి ఒ.దిలీప్ కిరణ్, ఎస్‌సి, ఎస్‌టి సెల్ డిఎస్పి జి.మురళీధర్, పాలకొండ ఆర్‌డిఒ ఎం.లావణ్య, డిఎస్‌పి జివి కృష్ణారావు, జిల్లా ప్రధాన అగ్నిమాపక అధికారి కె.శ్రీనుబాబు, జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారిత అధికారి ఎం.డి.గయజుద్దీన్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం. దేవుళ్ల నాయక్, కమిటీ సభ్యులు డి.శాంతిరాజ్, డిఆర్డిఎ పిడి పి.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

7,660 లబ్ధిదారులకు రూ. 81 లక్షల వడ్డీ రాయితీ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో జగనన్న ఇళ్లు నిర్మించుకున్న 7,660 మంది లబ్ధిదారులకు రూ. 81 లక్షల వడ్డీ రాయితీ జమైంది. ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి వర్చువల్ విధానంలో లబ్ధిదారులకు గురువారం రాయితీ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకూ జిల్లాలో జగనన్న ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం సుమారు రూ. 81 లక్షల వడ్డీ రాయితీని మంజూరు చేసిందని తెలిపారు. జిల్లాలో జగనన్న ఇంటి స్థలం పొంది, ఇల్లు కట్టని వారు వెంటనే నిర్మాణం మొదలు పెట్టాలన్నారు. జిల్లాలో సుమారు 25,419 మందికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందని, వీరిలో సొంతంగా ఇల్లు కట్టుకున్న 7,660 మంది లబ్ధిదారులకు రాయితీ విడుదల జరిగింది. అనంతరం లబ్ధిదారులకు వడ్డీ రాయితీ చెక్‌ను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ పథకం సంచాలకులు రమేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు అడ్డుపడుతున్నారు...

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని విక్రంపురంలో ప్రభుత్వం పంపిణీ చేసిన ఇళ్ల స్థలాల్లో సుమారు 18 మంది లబ్ధిదారులు గురువారం ఇళ్లు నిర్మించుకునేందుకు జెసిబితో తవ్వకాలు జరుపుతుండగా ఇదే గ్రామానికి చెందిన సాకేటి గురుమూర్తి, ఆయన భార్య విజయలక్ష్మి, కుమార్తెలు, అల్లుడు సరస్వతి, బాలామణి, లక్ష్మీ, రామకష్ణ అడ్డుకుంటున్నారని లబ్ధిదారులు తహశీల్దార్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాకేటి గురుమూర్తి 2020లో 40 సెంట్లు భూమిని రూ 4.40 లక్షలకు ప్రభుత్వానికి అమ్మకం జరిపి అప్పట్లో ప్రభుత్వం కూడా రిజిస్ట్రేషన్ చేయించుకుంది. సదర వ్యక్తికి భూమ్మీద ఎటువంటి హక్కులు లేనప్పటికీ నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి ఏర్పడడంతో ఇటీవల ఈ సమస్యను జెసికి, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినా కనీస చర్యలు తీసుకోలేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. 2020లో అరకు ఎంపి జి.మాధవి విక్రంపురంలో సమావేశం ఏర్పాటు చేసి 75 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారని లబ్ధిదారులు చెబుతున్నారు. ఇళ్లు నిర్మించుకుందామంటే సదర వ్యక్తి ఏదో ఒక విషయంలో అడ్డుపడడంతో నాలుగున్నరేళ్లుగా ఇళ్లు నిర్మించుకోలేకపోతున్నామని గృహ లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తమ సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఇళ్ల నిర్మాణ పనులను అడ్డుకుంటున్న గ్రామస్తుడు

కొనసాగుతున్న ఆటల పోటీలు

ప్రజాశక్తి -వీరఘట్టం

మండల కేంద్రంతో పాటు తలవరంలో గురువారం ఆడదాం ఆంధ్రా క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. ఈ క్రికెట్ పోటీలను ఎంపిడిఒ డి.శ్వేత ప్రారంభించారు. వీరఘట్టంలో నాలుగు సచివాలయాలతో పాటు కిమ్మి, నడుకూరు, దశమంతపురం, చలివేంద్రి, కంబర, చిట్టిపూడి వలస, నడిమికల్లా, నర్సిపురం, చిన్నగోరకాలనీ, తలవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలతో పాటు తలవరం, పనస నందివాడ, నీలానగరం, తెట్టింగి, వండువ, తూడి, కత్తుల కవిటి, బిటివాడ, హుస్సేన్‌పురం, రేగులపాడు, చిదిమి సచివాలయాల పరిధిలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయులు ఎం.రామకృష్ణ, ఎస్.ఉమామహేశ్వరరావు, టి.మధు, సచివాలయ కార్యదర్శులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండల స్థాయి ఆడుదాంఆంధ్ర క్రీడా పోటీలను ఎంపిపి ఉరిటి రామారావు, ఉమ్మడి జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రామీణ స్థాయిలో క్రీడా ప్రతిభను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పైడితల్లి, రావుపల్లి సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు (మహేష్), బాణాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

21న మెగా నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిట్టపూడివలస జంక్షన్ వద్ద గల శ్రీ సత్య సాయి ఆశ్రయంలో ఈనెల 21న విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి వ్యాధితో బాధపడుతున్న చుట్టుపక్కల గల గ్రామాల రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. నేత్ర శిబిరానికి వచ్చిన వారు తప్పనిసరిగా ఆధార్, రేషన్ కార్డులు తమ వెంట తీసుకురావాలని వారు కోరారు.

ఎంప్లాయిమెంట్ సేవలు ఇక ఆన్‌లైన్‌లో..

విజయనగరం : రాష్ట్రంలో అన్ని జిల్లాల ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజీల ద్వారా అందుతున్న సేవలన్నింటినీ భారత ప్రభుత్వ నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సిఎస్) పోర్టల్‌తో ఆన్‌లైన్‌లో అనుసంధానించినట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం కలెక్టర్ ఆవిష్కరించారు. ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్, అదనపు అర్హతలు నమోదు సులభ రీతిన http://employment.ap.gov.in ద్వారా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు.

ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను అందజేస్తున్న ఎంఇఒ ఆనందరావు

విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయులదే..

ప్రజాశక్తి - వీరఘట్టం

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఉపాధ్యాయులదే కీలకమని ఎంఇఒ ఆర్.ఆనందరావు అన్నారు. గురువారం స్థానిక విద్యా వనరుల కేంద్రంలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ట్యాబులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి మెరుగైన బోధన అందించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న 449 మంది విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.మానస, సిఆర్‌పిలు కె.వెంకటలక్ష్మి, జ్యోతి, ఆర్.సంగయ్య, జగదీష్, సిహెచ్ వాసు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -సాలూరురూరల్

మండలంలోని జీగిరాంలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందారు. వివరాల్లోకి జీగిరాంకు చెందిన చింతల తిరుపతి (43) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నారు, రాత్రి పడుకున్న వ్యక్తి తెల్లవారేసరికి మృతి చెందడంతో అనుమానంగా ఉందని మృతుని తల్లి అప్పలమ్మ అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతునికి సంబంధించిన అన్ని విషయాలు సేకరించి కేసు నమోదు చేసి విచారణ చేపడతామని రూరల్ ఎస్ఐ రమణ విలేకరులకు తెలిపారు. తిరుపతిరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మృతి చెందిన తిరుపతిరావు

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పార్వతీపురంరూరల్ : మండలంలోని నర్సిపురానికి చెందిన తూముల పోలినాయుడు అనే యువకుడు గురువారం కారాడవలసకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, గ్రామ సమీపంలోని చెరువు మలుపులో వాహనం అదుపుతప్పడంతో విద్యుత్ స్తంభానికి ఢీకొని తీవ్రగాయాల పాలయ్యాడు. స్పందించిన స్థానికులు 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.